ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



పోరాటానికి నేతన్నలు ముందుకు రావాలి 8లో..
కోటలు దాటుతున్న కేటీఆర్ మాటలు 8లో..

సొంతింటిపై ఆశలు



- జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు 1.10 లక్షల దరఖాస్తులు
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- దసరా కానుకగా మంజూరుకు ప్రభుత్వం సన్నాహాలు
- ఎమ్మెల్యేలకు సవాలుగా మారనున్న ఎంపిక
- స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం
- లేని వారికి రెండో విడతలో
- త్వరలో విధి విధానాల వెల్లడి
- అక్టోబరు 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక

ఎమ్మెల్యేలకు ఎంపిక కష్టమే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యేలకు కష్టంగా మారనుంది. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేలు వారి పార్టీ కార్యకర్తలకే ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి ఆరోపణలు మళ్లీ తలెత్తకుండా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కంటే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియనే కీలకం. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మొదటి దఫాలో కేటాయించిన నేపథ్యంలో జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 7 వేల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వేములవాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ లబ్ధిదారుల ఎంపికలో ఎవరికి ప్రయోజనం కలుగుతుందోననే చర్చ మొదలైంది. ప్రధానంగా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే తన గ్రామ నేతల ద్వారానే వివరాలు సేకరించి దరఖాస్తుల్లో ప్రాధాన్యం ఇస్తారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ఆసక్తిగా మారనుంది.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గూడు లేని అర్హులైన పేదలు సొంతింటి కోసం బోలెడు ఆశలతో ఎదురు చూస్తున్నారు. త్వరలోనే వారి కల నెరవేరనున్నట్లు కనిపిస్తోంది. దసరా వరకు ఇందిరమ్మ ఇళ్లకు ముహూర్తం ఖరారు కానుంది. అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సొంత స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం, రెండో విడతలో స్థలంలోపాటు ఆర్థిక సహాయం అందించనున్నారు. మహిళల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్ల అందించే విధంగా ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇళ్ల దరఖాస్తులను స్వీకరించింది. వివిధ పథకాలు ప్రారంభించినా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో 8 నెలలుగా ఒక నిర్ణయానికి రాలేదు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా పకడ్బందీగా అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో పారదర్శకత లోపించడంతో వివాదా స్పందంగా మారాయి. పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను రద్దు చేస్తారనే చర్చ సాగుతోంది. గతంలో ప్రజాపాలన గ్రామ, పట్టణాల్లో ఆరు గ్యారంటీల్లో వచ్చిన దర ఖాస్తులను పరిశీలించి ఇళ్లను ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం ఇందిరమ్మ ఇళ్ల అమలుకు ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకరావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. అర్హుల గుర్తింపు, ఇళ్ల నిర్మాణం, అందించే ఆర్థిక సహాయం, మం జూరు వరకు యాప్‌లో సమగ్రం సమాచారం ఉండేవిధంగా కసరత్తు చేస్తోంది.

వేలల్లో ఇళ్లు.. లక్షల్లో దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కింద గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ సంవత్సరం జనవరి 6 వరకు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తుల్లో ఆరు గ్యారంటీలకు సంబంధించి 1,92,617 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు లక్షా 10 వేల 198 దరఖాస్తులు వచ్చాయి. 338 అమరవీరుల కుటుంబాలు మంది ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. 2130 మంది తెలంగాణ ఉద్యమకారులు దరఖాస్తు చేసుకున్నారు. సొంత స్థలం ఉన్న బలహీన వర్గాల వారికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. మొదటి విడతలో జిల్లాలో నియోజక వర్గానికి 3500 ఇళ్లు మాత్రమే కేటాయిస్తుండగా దరఖాస్తులు మాత్రం లక్షకు పైగానే వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభించి మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తే మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

అసంతృప్తిగా వెక్కిరిస్తున్న 'డబుల్' ఇళ్లు

జిల్లాలో 12 మండలాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 6886 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశారు. ఇందుకోసం రూ.374.41 కోట్లనిధులు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 5437 ఇళ్లకు మాత్రమే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. 4248 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 3546 పూర్తి చేశారు. ఇందులో 3448 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. రూ.188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 ఇళ్లు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. కొన్ని దాదాపు పూర్తయిన మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవడం లేదు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన అనేక వివాదాల మధ్య అందించడం లేదు. పూర్తయిన ఇళ్లు కేటాయింపులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో సిరిసిల్ల మండలంలో 2052 లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముస్తాబాద్‌లో 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లి 549 ఇళ్లకు 110, ఎల్లారెడ్డిపేట 490 ఇళ్లకు 320, గంభీరావుపేట 476 ఇళ్లకు 371, వీర్నపల్లి 160 మంజూరవగా 50 నిర్మాణం ప్రారంభించారు. అయితే ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఇల్లంతకుంటలో 340 ఇళ్లకు 184 పూర్తి చేశారు. వేములవాడ రూరల్ మండలంలో 1080 ఇళ్లకు 80 పూర్తవగా వేములవాడ అర్బన్‌లో 800 ఇళ్లకు ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. కోనరావుపేట మండలంలో 92, చందుర్తి 45, రుద్రంగి 35 ఇళ్లు, బోయినపల్లిలో 65 ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిరాశనే మిగిల్చింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే సగం కూడా పూర్తి కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మంజూరైనా ఇళ్లలో ఇప్పటివరకు ప్రారం భం కానివి ముస్తాబాద్‌లో 175 ఇళ్లు, తంగళ్లపల్లి 178, ఎల్లారెడ్డిపేట 106, గంభీరావుపేట 43, వీర్నపల్లి 87, ఇల్లంతకుంట 156, వేములవాడ రూరల్ 1000, వేములవాడ అర్బన్ 656, కోనరావుపేట 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లిలో 65 ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులు ఇళ్లను అందించాలని కోరుతున్నారు.

తెలంగాణ చైతన్యానికి ప్రతీక ఐలమ్మ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 26: తెలంగాణ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని గురువారం జిల్లాలో అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, జిల్లా రజక సంఘాల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్, జిల్లా అధికారులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేపు జాతీయ మెగా లోక్ అదాలత్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: ఈనెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. గురువారం జిల్లా కోర్టులో ఆమె విలేకరులతో మాట్లాడారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్‌లు, గృహ హింస, ప్రి-లిటిగేషన్ కేసుల్లో ఇరువర్గాల వారికి తాము రాజీ పడినట్లు చెబితే ఆ కేసును తొలగిస్తారన్నారు. ఈ కేసుల్లో మళ్లీ పై కోర్టుకు వెళ్లి అప్పీలు చేసే అవకాశం ఉండదన్నారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: మహిళలను, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో 22మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మహిళలను వేధించిన పోకిరీలపై 37కేసులు నమోదయ్యాయని, మరో 40 పెట్టి కేసులు నమోదయ్యాయన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మహిళల భద్రతకు జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమస్య వస్తే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. నేరుగా సంప్రదించలేని వారు షీటీమ్ నంబరు 8712656425కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ ప్రమీల, మహిళా కానిస్టేబుల్ ప్రియాంక పాల్గొన్నారు.

కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 26:నల్గొండ జిల్లాలో కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులు తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్లాబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో లక్ష్మీనారయణకు వినతి పత్రం అందజేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు చేసినా ఇప్పటి వరకు విడుదల కాలేదన్నారు. నల్గొండ జిల్లాలో సస్పెన్షన్‌కు గురైన కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలని అన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్దాం



నివాళులర్పిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 26 : తెలంగాణ ధీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదామని వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం వేములవాడ తెలంగాణ చౌక్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వాములకు, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. పోరాట యోధులను, ఉద్యమ కారులను ప్రజా ప్రభుత్వం గుర్తిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోఠిలోని ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించారని, చాకలి ఐలమ్మ మనుమరాలను బీసీ కమిషన్ మెంబర్‌గా నియమించారని అన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, పులి రాంబాబు, పుల్కం రాజు, తూమ్ మధు, ముప్పిడి శ్రీధర్, రజక సంఘం నాయకులు పోతారం రాజబోసు, రమేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వాన్ని ఎదిరించిన వీరనారి ఐలమ్మ



నివాళి అర్పిస్తున్న కేటీఆర్, తదితరులు

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అనాటి సాయుధ పోరాటంలో నియంతృత్వాన్ని ఎదిరించి పోరాడి తెలంగాణకు స్ఫూర్తిని ఇచ్చిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి ఉత్సవాల్లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో మహనీయులకు కేసీఆర్ ప్రత్యేక గుర్తింపునిచ్చారన్నారు. నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ప్రవీణ్, సెస్ ఛైర్మన్ రామారావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పరిశీలిస్తున్న డీసీహెచ్ పెంచలయ్య

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వ, రక్త పరీక్షలు, రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో పిల్లల వైద్యుడిని నియమించాలని రోగులు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు. డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు చేపట్టి మొదటి సారి ఆసుపత్రికి వచ్చిన పెంచలయ్యను వైద్య సిబ్బంది సన్మానించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ బాబు, వైద్యులు ఉన్నారు.

రాజకీయ నాయకుడిగా కాదు.. మనవడిగా వచ్చా

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





నూతన భవనం ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీఆర్

బోయినపల్లి, సెప్టెంబరు 26: కొదురుపాకకు రాజకీయ నాయకుడిగా రాలేదని మనవడిగా వచ్చానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాక కేటీఆర్ తల్లి స్వగ్రామం. అమ్మమ్మ తాతయ్య లక్ష్మీబాయి, కేశవరావు జ్ఞాపకార్థం రూ.2 కోట్ల సొంత నిధులతో అధునాతన పాఠశాల భవనాన్ని కేటీఆర్ నిర్మించారు. గురువారం ప్రారంభోత్సవానికి కేటీఆర్‌తోపాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ హాజరయ్యారు. పాఠశాల భవనాన్ని కేటీఆర్ మేనమామ జోగినపల్లి శ్రీనివాసరావుతో ప్రారంభం చేయించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బాల్య జీవితంలో కొదురుపాకతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. తాత కేశవరావు తరచూ పాఠశాల సెలవుల్లో కొదురుపాకకు తీసుకొచ్చేవారంటూ గ్రామంతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు కొదురుపాక మిడ్ మానేరు ముంపునకు గురవుతున్న విషయం తెలియడంతో బాదేసిందన్నారు. తన రక్తబంధీకుల ఇళ్లు అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టుల్లో ముంపునకు గురయ్యాయన్నారు. నిర్వాసితుల బాధలు తనకు తెలుసన్నారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే సత్యంతో కలిసి పరిష్కరించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన అమ్మమ్మ తాతయ్యల జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాల భవనం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ప్రారంభించు కోవడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అమ్మమ్మ తాతయ్యపై ప్రేమతో కేటీఆర్ పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో కూడా అనుకున్నంత మార్పులు జరగకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారన్నారు. మురళిని విద్యా కమిషన్ ఛైర్మన్‌గా నియమించారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం అధునాతన పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయం అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి శ్రీనివాసరావు, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ వెంకటరామారావు, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులుశంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోల నియామకం హర్షణీయం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 26: జిల్లాలోని అన్ని మండలాలకు ఎంఈవోల నియామకం హర్షనీయమని తెలంగాణ రాష్ట్ర గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షురాలు జోగినపల్లి అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి లాకావత్ మోతీలాల్ అన్నారు. మండలంలో పనిచేస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఆ మండలానికి ఎంఈవోగా అదనపు బాధ్యతలు కేటాయించాలని కొంతకాలంగా ప్రభు త్వంతోపాటు జిల్లా విద్యాశాఖ అధికారులను కోరుతున్నట్లు చెప్పారు.

వేములవాడ రూరల్: మండల నూతన విద్యాశాఖ అధికారిగా లోకిని కిషన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలను స్వీకరించారు. అర్బన్ మండల విద్యాధికారి బన్నాజి, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, రాజరత్నం, ఉపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ, శ్రీధరాచారి, సంతోష్, ఆనందం, రవి, మధుకర్, సీఆర్‌పీలు నగేష్, నవీన్, దనుంజయ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల విద్యావనరుల కేంద్రంలో చందుర్తి, రుద్రంగి ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టిన ఓరుగంటి వినయ్ కుమార్, నల్లపురి రామకృష్ణను చందుర్తి మండల పీఆర్టీయూ టీఎస్ నాయకులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ చందుర్తి,రుద్రంగి మండలాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, చందుర్తి మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస చారి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి


- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో రానున్న బతుకమ్మ, దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజన్న ఆలయంలోని గెస్ట్‌హౌస్‌లో గురువారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతోపాటు ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయంలో ఏటా బతుకమ్మ, దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా ఎంతో వైభవంగా నిర్వహించాలని అన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన మహిళలు ఎక్కువ మొత్తంలో రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడేందుకు ఉత్సాహం చూపుతారని, దానికి అనుగుణంగా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు ప్రణాళికను రూపొందించి దానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఈవో వినోద్‌రెడ్డికి ఆదేశించారు. పక్క ప్రణాళికతోముందుకు సాగాలని ఆలయంలోని అధికారులు సమన్వయంతో బతుకమ్మ, దేవి నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ పండితులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్ తదితరులు ఉన్నారు.







యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటనపై వీడియో వైరల్

- ఎస్సై వేధింపులే కారణమంటూ బంధువుల ఆరోపణ - విచారణ చేపట్టిన పోలీస్ శాఖ?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26: కుటుంబ కలహాలతో ఈనెల 23న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లార పు శివప్రసాద్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోరుట్ల ఎస్సై దాడి చేయడంతోనే తన సోదరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రశాంతి ఆరోపిస్తోంది. ఈ ఘటనపై శివప్రసాద్ సోదరి ప్రశాంతి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియో బుధవారం నుంచే జగిత్యాల జిల్లాలో వైరల్ అవుతోంది.

శివప్రసాద్‌కు తన భార్యకు మధ్య వివాదం జరగడంతో ఈనెల 22న కోరుట్ల పోలీసులు ఫిర్యాదు మేరకు శివప్రసాద్‌ను పిలిపించారు. ఆ మరుసటి రోజే శివకుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే ఎస్సై దాడి చేయడంతోనే ఈ ఘటన జరిగినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు విడుదల చేసిన వీడియో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీస్ శాఖ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ నెల 22న కోరుట్ల పోలీస్ స్టేషన్ లో అసలు ఏమి జరిగింది అనే కోణంలో పోలీస్ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని దాచారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌరవేని రాజును రిమాండ్‌కు తరలించినట్లు, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు

ఎల్లారెడ్డిపేటలో చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో తాళం వేసి ఉన్న మొగుళ్ల మల్లేశం ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తాళం బద్దలు కొట్టిన చోరులు లోనికి ప్రవేశించి బీరువాలను ధ్వంసం చేశారు. బీరువా తెరచుకోకపోవడంతో అక్కడ నుంచి జారుకున్నారు. మండల కేంద్రంలో ఇంటి ఎదుట నిలిపిన ఎర్రవెల్లి కృష్ణకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎస్‌యూలో సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూ సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఉపకులపతి సురేంద్ర మోహన్‌కు ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలోని 14 కోర్సులో ఎనిమిది కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌గా ఉండడం వల్ల బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక పోతున్నారన్నారు. కోర్సులని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. విశ్వవిద్యాలయంలో 114మంది సిబ్బంది అవసరం ఉంటే కేవలం 63 మంది సిబ్బందితో నడుపుతున్నారన్నారు. సరైన విద్య అందక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పూర్తిస్థాయిలో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న యూనివర్సిటీ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ మృతిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి జనగామలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న నిరంజన్‌సింగ్ బోరియా మృతిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఒడిస్సాకు చెందిన నిరంజన్ సింగ్ బోరియా నెల రోజుల క్రితం ఇటుక బట్టీలో పనిలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం జయకుమార్ అనే తోటి కూలీతో కలసి నదిలో చేపలు పట్టుకుని వంట చేసుకుని తిన్నారు. కాసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుక బట్టీ నిర్వాహకులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిరంజన్‌సింగ్ బోరియా బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి బంధువు దుర్యోదన్ బోరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆహారం కలుషితం కావడమే లేక ఇతర కారణాలతో నిరంజన్‌సింగ్ మరణించాడా అనేది విచారణ తర్వాత స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు.



గీత కార్మికుడికి గాయాలు

జూలపల్లి, సెప్టెంబరు 26. మండల కేంద్రానికి చెందిన అమరగాని చంద్రయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఈతచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగ గాయపడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా బుదవారం ఈత చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో వెన్నుపూసకు దెబ్బ తగిలి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని మండల గీతకార్మిక, గౌడ సంఘం నాయకులు కోరారు.

నేడు విద్యార్థి గర్జన సభ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: హైదరాబాదులో శుక్రవారం నిర్వహించనున్న విద్యార్థి గర్జనసభ పోస్టర్లను భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ గురువారం మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉంటే ఏ ఒక్క మండలానికి కూడా రెగ్యులర్ ఎంఈవో లేని పరిస్థితి ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల హాస్టల్స్‌లో దాదాపు అద్దె భవనంలో అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతూ కొనసాగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నా సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచడం లేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న హైదరాబాదులో జరిగే విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులను మేధావులను కోరారు. ఈ కార్యక్రమంలో విష్ణు, రమేష్, భాను చందు, మర్రి శంకర్, శ్రీను, భారత్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరి నదిలో గురువారం సుదర్శి బాలరాజు(29) అనే తాపీ మేస్త్రీ గల్లంతయ్యాడు. తనతో నిర్మాణ పనులు చేసే ఇద్దరు మేస్త్రీలతో కలసి నదీ స్నానానికి వచ్చాడు. సమ్మక్క గద్దెల సమీపంలో ప్రమాదవశాత్తు బాలరాజు జారి నదిలో పడడంతో కొట్టుకుపోయాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బాలరాజు కొద్ది కాలంగా స్థానిక కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటు స్థానికంగా భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.

మహిళను రక్షించిన అగ్నిమాపక దళ సిబ్బంది



హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో గురువారం మతిస్థిమితం లేని ఓ మహిళ బావిలో దూకగా, అగ్నిమాపకదళ సిబ్బంది కాపాడారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్సపల్లికి చెందిన మన్నాల శారద మతిస్థిమితం లేక గ్రామంలో పేద బావిలో దూకింది. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బావిలోకి దూకి శారదను ప్రాణాలతో కాపాడారు. మహిళను కాపాడిన ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, ప్రభాకర్, సందీప్, అనిల్‌కుమార్, శివారెడ్డిలను గ్రామస్థులు అభినందించారు.

ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఇన్‌చార్జి వీసీ అధికారి సురేంద్ర మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎత్తివేసి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెర క్రాంతి, శివ, ప్రవీణ్, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి పాత రేషన్ డీలర్ల ఆందోళన



వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేస్తున్న పాత రేషన్ డీలర్లు, పెట్రోల్ బాటిల్‌తో పాత మహిళ రేషన్ డీలర్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 26: తమ రేషన్ దుకాణాలు తమకివ్వాలని దాదాపు 30 మంది పాత రేషన్ డీలర్లు గురువారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. పోలీసులు వాటర్ ట్యాంక్‌పైకి రావాలని చూస్తే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు మహిళా డీలర్లు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న అడి షనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ అహ్మద్ బుజ్జగించే ప్రయ త్నం చేశారు. కేవలం పాత్రికేయులు పైకి వెళ్లడానికి బాధితులు ఒప్పుకున్నారు. వాటర్ ట్యాంక్‌పైకి చేరిన పాత్రికేయులతో డిమాండ్లను వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల పట్టణం, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో 58 రేషన్ దుకాణాలతో పదేళ్లుగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తమకు సమాచారం లేకుండా దుకాణాలకు నోటిఫికేషన్ వేశారన్నారు. అనర్హులకు అధికార పార్టీ నాయకులు, అధికారులు రేషన్ దుకాణాలను ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని ఇచ్చి తమకు అన్యాయం చేశారని పాత మహిళా డీలర్లు కన్నీరు పెట్టుకున్నారు. డబ్బుల కోసమే తమ రేషన్ దుకాణాలను తమకుకాకుండా చేస్తే ఆ నాయకులకు, ఆ అధికారులకు బిచ్చమెత్తైన డబ్బులు ఇస్తామని, దుకాణాలు ఇవ్వండని వేడుకున్నారు. కలెక్టర్ స్పందించి తమ దుకాణాలు తమకివ్వాలన్నారు. కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడతామని పోలీసు ఆధికారులు, తహసీల్దార్ నచ్చజెప్పడంతో వాటర్ ట్యాంక్ దిగి వచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు

- మంత్రి ఉత్తమ్‌కు ఫోన్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ దుకాణాల కేటాయింపు వివాదం చర్చనీయాంశంగా మారింది. 54 దుకాణాలకు సంబంధించి రాత పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు జరిపినా కేవలం కాంగ్రెస్ సంబంధిచిన వారికే అడ్డదారిన ఇచ్చారనే దానిపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు బాధితులు గోడు వెళ్లబోసుకన్నారు. సిరిసిల్లలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాధితులు కేటీఆర్‌ను కలుసుకున్నారు. గతంలో మహిళ సంఘాల ద్వారా నిర్వహించిన వాటిని తొలగించిన విషయంతో పాటు అర్హతలు లేనివారికి కేటాయించడం ఇతర అవకతవకలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన అవకతవకలపై వివరిం చారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలిస్తామని చెప్పారు. కేటీఆర్ సిరిసిల్ల అర్డీవోకు ఫోన్ చేయగా అయన ఫోన్ ఎత్తలేదు. ఆర్డీవో కార్యాలయంలోనే రేషన్ దుకాణాలపైనే విజిలెన్స్ ఎన్‌పోర్స్‌మెంట్ తనిఖీలపై మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దానిపై కేటీఆర్ బాధితులతో హైకోర్టులో పిటిషన్ వేసే విషయంపై చర్చించారు. న్యాయ పోరాటం చేస్తామని ఎవరినీ వదిలేదిలే దని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.


కేటీఆర్‌కు సమస్యను చెప్పుకంటున్న బాధితులు

29న కొండగట్టులో ఆలయాల అర్చకులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 26: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలు ఆలయాల అర్చకులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ ఉజ్వల, రిసార్ట్ అధినేత మర్రిపెల్లి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తత్వం చారిటబుల్ ట్రస్టు అధినేత బంగారయ్యశర్మ, అతిథులుగా బిర్లామందిర్ ప్రధానార్చకుడు ఎం లక్ష్మీనరసింహాచార్యులు, దర్శనం మాసపత్రిక సంపాదకుడు మారుమాముల వేంకటరమణశర్మ, వేద, పురాణ, ఇతిహాస, ప్రవచన పండితులు పురాణం మహేశ్వరశర్మ, నంబి వేణుగోపాలాచార్యుల కౌశిక, రిసార్ట్ ఎండి కొండలరావు, ఏబీ6 న్యూస్ ఛానల్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్ హాజరవుతారిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల వారిచే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఔత్సాహికులు సెల్. 7382171021, 9059550280 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సమాజ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26: సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ఇటీవల రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరగాయని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 26: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని మానేర్ నుండి ఇసుక లోడులతో వస్తున్న నాలుగు లారీలను శంబునపల్లి గ్రామంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ గురువారం రాత్రి పట్టుకున్నారు. లారీలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం సీజ్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వద్ద ఓ వాహనంలో సంచుల్లో నింపి ఉన్న బ్యాగులను రవాణా చేస్తుండగా తాము పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా పలు చోట్ల డంపులు ఏర్పాటు చేసుకుని ఆ ఇసుకను జల్లెడ పట్టించి 25 నుంచి 30 కిలోల బ్యాగుల్లో నింపి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విషయం బయటపడిందని తహసీల్దార్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 22 గేట్లు ఎత్తిన అధికారులు


దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 22 వరద గేట్లు ఎత్తి 81,224 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 1,09,214 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా

మంథని, సెప్టెంబర్ 26: మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామ శివారులో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కన ఇసుక లారీ అదుపు తప్పి గురువారం బోల్తా పడింది. మండలంలోని అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ నుంచి కరీంనగర్‌కు లోడ్‌తో వెళ్తున్న లారీ గంగాపురి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ఈప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు. స్థానికులు లారీ క్యాబిన్ చిక్కున్న డ్రైవర్‌ను బయకు తీశారు. డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

రామగుండం ఎన్టీపీసీకి మూడు జాతీయ స్థాయి అవార్డులు

- ఇంధన పొదుపు, పవర్ ఎక్సలెన్స్‌లో ఎకనామిక్ టైమ్స్ నుంచి పురస్కారం


అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, సెప్టెంబరు 26: రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ కన్‌జర్వేషన్(ఇంధన పొదుపు), పవర్ ఎక్స్‌లో మూడు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ప్రముఖ పబ్లికేషన్స్ సంస్థ ది ఎకనామిక్ టైమ్స్ ప్రతి ఏటా విద్యుత్ సంస్థలకు అవార్డులను అందజేస్తున్నది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీకి అందజేసింది. ఇంధన ఎదుపు అవార్డు(ఇండస్ట్రీస్), ఎనర్జీ కంపెనీ అవార్డు(పవర్), ఎనర్జీ కంపెనీ అవార్డులను(రిన్యూవబుల్) కేంద్ర ఇంధన శాఖ క్యాబినేట్ మంత్రి ప్రహ్లాద్ జోషి రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడుకు అందజేశారు. విద్యుత్ రంగంలో ఘననీయమైన చరిత్ర ఉన్న రామగుండం ఎన్టీపీసీకి మరోసారి జాతీయస్థాయి పురస్కారాలు రావడంపట్ల ప్రాజెక్టులో హర్షం వ్యక్తం అవుతున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రాజెక్టు పలు రంగాల్లో అత్యుత్తమంగా పని చేయడం ద్వారా అనేక బెంచ్‌మార్కులను, రికార్డులను నమోదు చేసింది. ఇంధన పొదుపు, జనరేషన్, సాంప్రదాయేతర విద్యుత్, పర్యావరణం తదితర రంగాల్లో అవార్డులు సాధిస్తున్నది.

3 నుంచి రాజన్న ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


విగ్రహాలను శుద్ధి చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో అక్టోబరు 3వ తేది శనివారం నుంచి దేవినవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో గురువారం శ్రీదేవినవరాత్రోత్సవాలకు మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో శ్రీదేవినవరాత్రోత్సవాలు అక్టోబరు 3వ తేది శనివారం నుంచి 12వ తేది శనివారం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేది బుధవారం రోజున ఉదయం 9 గంటలకు మూలా నక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10 తేది గురువారం రోజున దుర్గాష్టమిని పురష్కరించుకుని ఉదయం 8.30 గంటలకు నుంచి చండీ అమ్మవారి వద్ద శ్రీచండీకలశప్రతిష్ఠ, చండీ సప్త శతీ హవనము చేపట్టగా రాత్రి 8 గంటలకు శ్రీమహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ జరగనున్నాయి. 11వ తేది శుక్రవారం రోజున ఉదయం 11.05 గంటలకు పూర్ణహుతి, బలిహరణ రాత్రి 8.30 గంటలకు నుండి అమ్మవారిక ధర్మగుండంలో తెప్పోత్సవము నిర్వహించనున్నారు. 12వ అది శనివారం రోజు విజయదశమి (దసరా)ను సందర్భంగా ఉదయం 10.45 గంటలకు ఆలయుధపూజ, సాయంత్రం 5 గంటలకు నుంచి స్వామి వారి పెద్దసేవ (అంబారీ సేవ)ను, స్వామి వారి అమ్మవార్ల శమీపూజ, అపరాజిత పూజ చేపట్టానున్నారు. శ్రీదేవినవరాత్రోత్సవాలతో ప్రతినిత్యం సాయంత్రం 4 గంటలకు శ్రీమత్ దేవీభాగవత పురాణ ప్రవచనము నిర్వహించడంతో పాటు స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దాడి?

- కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఉన్నతాధికారులకు పిర్యాదు చేయడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రా నికి చెందిన కుందారపు గంగాధర్ అనారోగ్యానికి గురి కావడంతో అతని కుమారుడు నరేష్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించాడు. చికిత్స అందించే విషయంలో వైద్యులతో పాటు సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణతో నరేష్ పలు ఘటనలను తన ఫోన్‌లో వీడియో ద్వారా బుధవారం రాత్రి చిత్రీకరించాడు. దీంతో సదరు వీడియోలను డిలీట్ చేయాలని కోరుతూ కింది స్థాయి సిబ్బంది ఒకరు నరేష్‌పై దాడికి పాల్పడ్డట్లు బాధితుడు కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, ప్రాథమికంగా విచారణ చేశామని, రోగి బంధువు, సంబంధిత సిబ్బంది మధ్య పాత గొడవలున్నట్లుగా తెలుస్తోందని స్పష్టం చేశారు. మరింత లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలకు కార్పొరేషన్ అధికారుల నోటీసులు

- తమ తప్పేమిలేదంటున్న నిర్మాణదారులు


కార్పొరేషన్ టీపీఎస్‌తో మాట్లాడుతున్న వినాయకనగర్ వాసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: రామగుండం నగరపాలక సంస్థ 5వ డివిజన్ పరిధిలోని మల్లపురాణి కుంట ఎఫ్‌టీఎల్‌లో 16 భవనాలకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఆదేశానుసారం నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వే చేసి మల్లపురాణికుంటకు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించారు. 16 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉండగా 36 నిర్మానాలు శిఖంలో ఉన్నాయి. శిఖంలో ఉన్న నిర్మాణాలను తొలగించుకోవాలని ఇప్పటికే కార్పొరేషన్ సమాచారం ఇచ్చింది. గురువారం ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. కాగా బఫర్ జోన్‌లో కూడా చాలా నిర్మాణాలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా వినాయకనగర్ వాసులు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. తాము నిర్మించుకున్న నివాసాలకు గతంలో రెవెన్యూ నాలా కన్వర్షన్ ఇచ్చిందని, ఇరిగేషన్ ఎన్‌ఓసీలు ఇచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్లు ఇచ్చిందని, అలాంటప్పుడు మా తప్పు ఎలా అవుతుందంటూ పేర్కొన్నారు. కాగా నోటీసులకు రాతపూర్వక సమాధానం ఇవ్వాలని, తాను అధికారులకు నివేదిస్తానని టీపీఎస్ నవీన్, నిర్మాణదారులతో పేర్కొన్నారు. కాగా మల్లపురాణికుంట శిఖం భూముల్లోని నిర్మాణదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలా ఆక్రమణలు, చెరువుల ఆక్రమణలపై పరిశీలన జరిపారు. త్వరలోనే యాక్షన్ ప్లాన్ చేపడుతారనే ప్రచారం జరుగుతున్న సందర్భంలో నోటీసులు కలకలం రేపాయి. వినాయక నగర్ ఎఫ్‌టీఎల్ నిర్మాణ బాధితుల్లో పోలీస్‌శాఖకు చెందిన పలు కుటుంబాలు ఉన్నాయి.

జెన్‌కో ద్వారానే విద్యుత్‌కేంద్రం నిర్వహించాలి


నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: సింగరేణికి నూతన ప్రాజెక్టులో భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ, జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ సర్కిల్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో ద్వారా నిర్వహించిన 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేయడానికి నిర్ణయించారన్నారు. దాని స్థానంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి, జన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. నూతన విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని ఉద్యోగ,కార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, వీరయ్య, సంపత్ కుమార్, శ్రీనివాస్, జనార్ధన్, స్వామి, సుధీర్ కుమార్, కిరణ్ ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త చెరువు నాలాలపై ఆక్రమణలను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26 : సిరిసిల్ల కొత్త చెరువు నాళాలు, శాంతినగర్ రొడ్డం ఆక్రమణాలను తొలగించాలని గురువారం ఏఐఎఫ్టీయూ (న్యూ)నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో కొత్త చెరువుకు సంబంధించిన నాళాలు, రొడ్డం 16 సంవత్సరాలుగా ఆక్రమణాలకు గురవతున్నాయన్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రవీందర్, ఎర్రజెండా పవర్ లూం కార్మిక సంఘం జిల్లా నాయకుడు బొద్దుల శ్రీహరి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 26: మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25)మద్యానికి బానిసై గురువారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సాయి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు ఏర్పడటంతో అతడి భార్య ఏడాది క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనస్థాపానికి గురైన సాయి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సాయి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై వివరించారు. ఇదిలా ఉండగా తన చావుకు ఎవరూ కారణం కాదని, మద్యానికి బానిసై అందరినీ బాధపెట్టానని తనను క్షమించాలని రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో లభించింది.

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 26: కారుకొనివ్వలేదని ఇంట్లోనుంచి పారిపోయి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం రాగిల్ల గ్రామానికి చెందిన దేతపు వంశీ (20) కారు కొనివ్వాలని ఇంట్లో తరచూ తల్లిదండ్రులను అడిగేవాడు. కారు కొనివ్వకపోవడంతో వంశీ మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన వంశీ కనిపించకుండా పోయాడు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులోని గుట్టప్రాంతంలో వంశీ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం తెలిసింది. మృతుడి తండ్రి రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి ఒక్కసారిగా కోతి అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కమాన్‌పూర్ మండలానికి చెందిన బూడ రాజు అనే వ్యక్తి ముత్తారం మండల కేంద్రంలో విద్యుత్తు లైన్ల సవరణలో కాంట్రాక్టు లేబర్‌గా విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపాడు. తలకు తీవ్రగాయాలు కాగా అక్కడే ఉన్న కానిస్టేబుల్, స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.... చందుర్తి మండలంలోని అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కట్కూరి స్వామి, గంగుల శ్రీను, చింత శేఖర్‌లకు బావి పంచాయతీ విషయంలో తరుచు గొడవలు తలెత్తాయి. ఈ గొడవల్లో భాగంగా రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశ్యంతో స్వామి, శ్రీను, శేఖర్‌లు కర్రతో దాడిచేశారు. ఈ దాడిపై బాధితుడు రాంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్ఐ నీలం రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్ఐ రవిందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్‌లు తిరుపతి, లతీఫ్, సిఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ మధులు 11మంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సబ్‌కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ నిందితులపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: గోదావరిఖని గాంధీనగర్‌లో పొరిగింటివారితో వివాదం కారణంగా కోరె శంకర్ అనే సింగరేణి కార్మికుడు గురువారం సాయంత్రం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొరిగింటి వారితో వివాదంలో మహిళ శంకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంకర్ కూడా ఆమెపై ఫిర్యాదు చేశాడు. ఈ వివాదంలో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పనిలో నుంచి తొలగించారని మెడికల్ కళాశాల కార్మికుడు..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: తనపై అకారణంగా కేసు పెట్టి విధుల నుంచి తొలగించారంటూ గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో గురువారం మసూద్ అనే కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంట్రాక్టర్ తరుణ్ మెడికల్ కళాశాలకు రాగా మసూద్ అతనితో వాగ్వాదానికి దిగి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

గంజాయి పట్టివేత: నలుగురు నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26: కరీంనగర్ శివారులోని రేకుర్తిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 223 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించగా నలుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. చింతకుంటకు చెందిన నెలమడుగు హరీష్, ధర్మారం రవి, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన మాచర్ల రవితేజ, రేకుర్తి గ్రామానికి చెందిన షేక అఫ్జల్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల ఖాసీంబి, కమలాకర్, సంతోష్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడంలో ఎన్‌పీడీసీఎల్ నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఎఫ్‌సీఐ గౌతమినగర్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో హై వోల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో 24 ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇతర విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. గౌతమినగర్ హౌసింగ్ సొసైటీలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా చెట్ల కొమ్మలతో వైర్లు తగులుతున్నాయని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది పట్టించుకోలేదని గౌతమినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. పైగా హై వోల్టేజీతో నష్టం జరిగితే కోతులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్‌పీడీసీఎల్ అధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా చూడాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు, సెప్టెంబరు 26: మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన మారం సతీష్(34)అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సతీష్ ఈనెల 22న బిల్డింగ్ మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారీ కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి ముక్కు, చెవుల నుంచి రక్తం కారింది. గమనించిన అతడి భార్య మధవి కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని పౌరసత్వంపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. రమేశ్ పౌరసత్వం వ్యవహారంపై గతంలోనే తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బెంచ్ ఈ కేసులో మరిన్ని వివరాలు.. పలు అంశాలపై స్పష్టత కోసం గురువారం మళ్లీ విచారణ చేపట్టింది. చెన్నమనేని రమేశ్ ట్రావెల్ రికార్డులు తెప్పించిన హైకోర్టు వాటిని పరిశీలించింది. రమేశ్ ఇప్పటికీ జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నారని, జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నప్పటికీ ఎమ్మెల్యేగా పోటీచేయడం అక్రమమని పేర్కొంటూ ఆయన ప్రత్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఫిర్యాదుతో కేంద్ర ప్రభుత్వం రమేశ్ పౌరసత్వం రద్దు చేసింది. పౌరసత్వ చట్టం-1955కి విరుద్ధంగా తన పౌరసత్వం రద్దు చేశారని పేర్కొంటూ 2019లో రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ పౌరసత్వం రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. అప్పటి నుంచి దాదాపు నలుగురు జడ్జిలు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. తాజాగా జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. జర్మనీ పౌరసత్వం కలిగిన రమేశ్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఆధారంగానే జర్మనీకి ట్రావెల్ చేస్తున్నారని, అందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని ఆది శ్రీనివాస్ తరఫు సీనియర్ న్యాయవాది రవికిరణ్‌రావు పేర్కొన్నారు. జర్మనీ పౌరసత్వం ఎప్పుడో వదులుకున్నట్లు రమేశ్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అన్ని ఆధారాలను, రికార్డులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబరు 17న తీర్పు వెలువరించనున్నట్లు పేర్కొంది.

ఘనంగా మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజయ్య రాంరెడ్డి, రాజేందర్, నారాయణరెడ్డి, బాలయ్య, లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, బాల్‌రెడ్డి, మల్లేశం, రవి పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో సంఘం బలోపేతం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: సభ్యుల సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతం చేసి అభివృద్ధికి పాటుపడుతామని ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సంఘం ఔకార్యాలయంలో మహాజన సభ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందించామన్నారు. వైస్ ఛైర్మన్ సత్త్రయ్య, డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, సుధాకర్, సరిత, రామచంద్రారెడ్డి, సతీష్, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సహకారంతో సంఘం అభివృద్ధి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 26: రైతుల సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి చెందిందని ప్యాక్స్ ఛైర్మన్ కొడూరి భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహజన సభ ప్యాక్స్ ఛైర్మన్ భాస్కర్‌గౌడ్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు సుమారు రూ.7 కోట్లకు పైగా రుణాలు అందించామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన ప్యాక్స్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు రవీందర్ రావు, రాజయ్య, రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి, గణేశ్‌గౌడ్, బాలరాజవ్వ పాల్గొన్నారు.

వడ్డేపల్లి కృష్ణ మరణం తీరని లోటు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 26: సినీగేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ అకాల మరణం సిరిసిల్ల సాహితీ లోకానికి తీరని లోటని సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జనుపాల శంకరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో గురువారం సమితి ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. వడ్డెపల్లి కృష్ణ, సిరిసిల్లకు చెందిన కవులు, రచయిత సబ్బని బాలయ్య, అధ్యాపకుడు జగన్నాథం మృతికి మౌనం పాటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో పలువురు కవులు రచయితలు మాట్లాడుతూ వడ్డెపల్లి కృష్ణ సిరిసిల్ల గడ్డపై పుట్టి తన కవితల ద్వారా ఎందరికో మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, సీనియర్ సిటీజన్ అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, పంతులు, అంజనాదేవి, దేవానందం, రాజేశం, తిరుపతి, గోషికొండ దామోదం పంతులు, వంశీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 26: దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని, అసెంబ్లీ పరిధిలో జనాభా ఆధారంగా బడ్జెట్‌ను కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దుంద్రపల్లి రవీందర్, జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం అదనపుకలెక్టర్ ఖీమ్యా నాయక్‌ను దళిత హక్కుల పోరాటసమితి నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఎస్సీ ఇండస్ట్రీ సబ్సిడీ నిధులు విడుదలతోపాటు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని కోరారు.

విద్యారంగం సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 26 : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కును కల్పించాలని బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం కోరారు. సిరిసిల్లలో గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కును కల్పించాలంటూ వినతి పత్రాలను అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్ మానేరుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 26: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 11,800 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.38 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 25.964 టీఎంసీల మేరకు చేరుకొంది.

యువకుత ఐకమత్యంతో ముందుకు సాగాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26: యువకుత ఐకమత్యంతో ముందుకు సాగాలని పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సూచించారు. గ్రామంలో గురువారం దుర్గాదేవి మండప నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దుర్గాదేవి విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులకు రూ.10వేల116 అందజేశారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 26 : తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చిట్యాల ఐలమ్మ 129వ జయంత్యుత్సవాలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు ఆమెకు నివాళులర్పించారు. సిరిసిల్ల పట్టణంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేశారు. అనంతరం ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఎం జిల్లా కమిటి సభ్యులు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మకు నివాళులర్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని చిట్యాల ఐలమ్మ విగ్రహానికి సిరిసిల్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, స్థానిక కౌన్సిలర్ వెల్దండి దేవదాస్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా, పట్టణ నాయకులు ఐలమ్మ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● సిరిసిల్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, సిరిసిల్ల మార్కెట్ కమిటి అధ్యక్షురాలు వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నీలి రవీందర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట, కందికట్కూరులో గురువారం చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్, సీఐటీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరుకోలు మల్లయ్య, సావనపెల్లి రాములు, రజక సంఘాల అధ్యక్షులు లింగంపల్లి రవీందర్, పైడి రాజు, రజకసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తెలంగాణ శ్రీను, యువజన కాంగ్రెస్‌మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నబోనాల రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు అగ్గిరాములు, కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, భూక్య రెడ్డినాయక్, బోల్గం నాగరాజుగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ జీల కిషన్, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్‌పట్టణ అధ్యక్షుడు భూక్య తిరుపతినాయక్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, అల్మాస్‌పూర్, రాచర్లబొప్పాపూర్ తదితర గ్రామాల్లో రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నూతనంగా నియమితులైన ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ గొప్ప వీరనారీ , భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిని గొప్ప వీరనారీ అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మిరుదొడ్డి దేవయ్య హనుమయ్య సుద్దాల దేవయ్యతదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు లింగాపూర్, నర్మాల గ్రామాల్లో చాకలి అయిలమ్మ జయంతిని నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మండల రజక సంఘం అధ్యక్షుడు గుండారపు మహేందర్, ప్రధాన కార్యదర్శి గూడెం రవి, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ చంద్రయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్ఐలు మధుకర్, రమేశ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : కాంగ్రెస్ నాయకులు నెరెళ్ల నర్సింగం, పెద్దూరి తిరుపతి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. నాయకులు జల్గం ప్రవీణ్, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో ఎంపీడీవో లక్ష్మీనారయణ, ఎంపీవో మీర్జా, సూపరింటెండెంట్ రమేశ్‌నివాళులర్పించారు.

వీర్నపల్లి : మండల రజక సంఘం అధ్యక్షుడు లోకుర్తి దేవయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. రజక సంఘం ఉపాధ్యక్షుడు పొన్నం హన్మండ్లు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: తెలంగాణ చౌక్ లోని ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించి ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. రూరల్ మండల సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మున్సిపల్ కౌన్సిలర్లు నరాల శేఖర్, నిరిగిరి చందు, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, నాయకులు యాదగిరి ప్రసాద్ రావు, కొండ నర్సయ్య, వెంగల శ్రీకాంత్ గౌడ్, రజక సంఘం రూరల్ అధ్యక్షులు మొగిలి అంజయ్య, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, కచ్చకాయల ఎల్లయ్య మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషాపాల్గొన్నారు.

● కోనరావుపేట మండల కేంద్రంలో పాటు మామిడిపల్లి సుద్దాల తదితర గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. సింగిల్ విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సుద్దాల నర్సయ్య, బత్తుల కమలాకర్, గొట్టె ప్రభాకర్, కొడగంటి గంగాధర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు లింగంపల్లి శంకర్, గంగాధర్, లంకదసారి శ్రీనివాస్, గంగారాజం, నరేష్, జయంత్ పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



గంభీరావుపేటలో కొండూరు రవీందర్‌రావు



బెటాలియన్‌లో కమాండెంట్, అధికారులు..



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్



వేములవాడలో..



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రమేష్

వేములవాడ, సెప్టెంబర్ 26: నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ కోరారు. వేములవాడ పట్టణ సీపీఎం మహాసభ గురువారం నిర్వహించారు. ముందుగా సీపీఎం జాతీయ కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి పరిష్కారం కోరుతూ పోరాటాలు చేస్తామని అన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకునే ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక దఫాలుగా రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపడతామని దానికి అవసరమైన అన్ని నిధులు కేటాయిస్తామని గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలతో మభ్యపెడుతున్నాయన్నారు. పాలకులు చెబుతున్న మాటలు అమలుకు నోచుకోవడం లేదని, వెంటనే కల్లబొల్లి మాటలు ఆపివేసి రోడ్ల వెడల్పు చేపట్టాలని సీపీఎం తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. మూలవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం సంవత్సరాలు గడుస్తున్నా అసంపూర్తిగానే మిగిలిపోయిందని, వెంటనే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వేములవాడలో ఎంతోమంది నిరుపేదలు ఉండడానికి ఇల్లు కూడా లేక ఇబ్బంది పడుతున్నారని గత పది సంవత్సరాల కాలంలో అప్పటి ప్రభుత్వం ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయలేదని, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎగుమంటి ఎల్లారెడ్డి, మల్లారం ప్రశాంత్, గుర్రం అశోక్, చిలుక బాబు, పరుశరాములు, నగేష్, సిరిమల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ పట్టణ సీపీఎం కార్యదర్శిగా ముక్తికాంత అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వేములవాడలో నిర్వహించిన సీపీఎం మహాసభలో తీర్మానం చేశారు. ముక్తికాంత అశోక్‌ను వేములవాడ పట్టణ సీపీఎం కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు.

రేషన్ దుకాణాలను స్థానికులకు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 26 : సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేసిన ఏడు గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు స్థానిక నిరుద్యోగులకు కేటాయించాలని 12వ వార్డు కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పోచవేణి ఎల్లయ్యయాదవ్, నర్మెట ప్రభుదాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. మున్సిపల్‌లో విలీనం చేసిన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న రేషన్ దుకాణాలకు రిజర్వేషన్‌ల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు ప్రకటించారని, దరఖాస్తు చేసుకున్న వారందరికి రెవెన్యూ అధికారులు పరీక్షలను సైతం నిర్వహించారని అన్నారు. పరీక్షల ఫలితాలను ప్రకటించ కుండానే ఇంటర్వ్యూల ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని ప్రకటించిన అధికారులు ఇష్టానుసారంగా రేషన్ దుకాణాలకు డీలర్లు ఎంపిక చేశారన్నారు. విలీన గ్రామాలకు చెందిన వారిని కాకుండా సిరిసిల్ల పట్టణంలోని స్థానికేతరులకు దుకాణాలను కేటాయించారన్నారు. విలీన గ్రామాలకు చెందిన వారికి రేషన్ దుకాణాలను కేటాయించాలని, లేని పక్షంలో విలీన గ్రామాల్లో ఆందోళనలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెశం, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి నేతన్నలు ముందుకు రావాలి

- కాంగ్రెస్ నాయకుల మాటలకు ఆగం కావద్దు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుల మాటలకు ఆగం కావద్దని, నేతన్నల తరఫున కొట్లాడేందుకు మేమున్నామని, పోరాటానికి ముందుకు రావాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల నేతన్నలను గోస పెడుతున్నారన్నారు. పదేళ్లుగా బంద్లైన ఆత్మహత్యలు మళ్లీ మొదలైనా ముఖ్యమంత్రికి మనసు రావడం లేదా? అన్నారు. దారుణమైన నిర్ణయంతో ప్రభుత్వం బతుకమ్మ చీరలను బంద్ చేసిందని బతుకమ్మ చీరల వెనక ఉన్న ఉద్దేశం ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి తెలియదని అన్నారు. అసెంబ్లీలో సీఎంకు చెప్పే ప్రయత్నం చేశానని తన మీద కోపమన్నారు. రాజకీయ కక్ష ఉంటే తన మీద తీర్చుకోవాలని, నేతన్నలను ఇబ్బంది పెట్టవద్దని చెప్పానన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 2004 - 2014 వరకు అత్మహత్యల పరంపర కొనసాగింద న్నారు. ఆత్మహత్యలకు చలించి అప్పట్లో ఎంపీగా కేసీఆర్ రూ.50 లక్షల సిరిసిల్లలోని పద్మశాలీ పెద్దలకు, ట్రస్టుకు ఇచ్చారని గుర్తు చేశారు. 2 వేల మందికి వడ్డీ లేకుండా సూక్ష్మ రుణాలు ఇచ్చి అదుకున్నారన్నారు. సిరిసిల్ల పారిశ్రామికులతో మాట్లాడి కార్మికులకు వస్తున్న రూ.6 వేల వేతనాన్ని రూ.20 వేల వరకు చేయడానికి బతుకమ్మ చీరలను తెచ్చినట్లు చెప్పారు. సిరిసిల్ల నేత కార్మికుల కోసం రూ.3312 కోట్ల ఆర్డర్లు ఇచ్చారన్నారు. సిరిస్లిలను మరో తమిళనాడులోని తిర్పూర్‌గా చేయాలనుకున్నామని దురదృష్టం కొద్దీ ప్రభుత్వం రాలేదని అన్నారు. తన మద కోపంతోనే ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వలేదన్నారు. రూ.3312 కోట్ల అర్డర్లలో రూ.200 కోట్లు మాత్రమే బకాయి మిగిలిపోయిందన్నారు. మళ్లీ ప్రభుత్వం వస్తుందని అనుకున్నామని లేకుంటే వాటిని కూడా తీర్చేవారమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 365 రోజులు ఉపాధి, డబుల్ ఆర్డర్ల హామీ ఏమైందన్నారు. స్వశక్తి సంఘాల మహిళలకు ఇస్తామన్న చీరల ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వాలన్నారు. 22 మంది నేతన్నలు, రైతులు, ఆటో కార్మికులు చనిపోయారని శాసనసభలో లిస్ట్ ఇచ్చినా స్పందించలేదన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

అధికారులు, కాంగ్రెస్ నాయకులుగా అతి ఉత్సాహం

సిరిసిల్లలో విచిత్రమైన పరిస్థితులు ఉన్నాయని నాలుగు సార్లు తన మీద ఓడిపోయినాయన రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, ఇక్కడా తనదేనన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, దానికి అధికారులు వంత పాడుతున్నారని అన్నారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు అతి ఉత్సాహం అడ్డగోలు జమాబందీగా వ్యవహారం చేస్తున్నారని అన్నారు. 54 రేషన్ దుకాణాల కేటాయింపుల్లో డబ్బులు తీసుకున్న వ్యవహారంపై కాంగ్రెస్ నాయకులే నిరసన తెలుపుతున్నారన్నారు. అర్హులైన బాధితులు ట్యాంక్‌లు ఎక్కి ఆందోళన చేస్తున్నారన్నారు. రాత పరీక్షల మెరిట్ లిస్టను ప్రకటించాలన్నారు. అధికారులకు శిక్షలు తప్పవని రిటైర్ పోయినా రికవరీ చేస్తామని అన్నారు. మళ్లీ తమ ప్రభుత్వమే వస్తుందని టైం వచ్చినపుడు అధికారులకు మిత్తితో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల కేటాయింపుపై న్యాయం పోరాటం చేస్తామని హైకోర్టుకు వెళ్తామని అన్నారు. నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, గజభీంకార్ రాజన్న, మానస, అక్కరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోటలు దాటుతున్న కేటీఆర్ మాటలు

- గతంలో అవినీతి, అక్రమాలు బయటపెడతాం

- నేతన్నలకు క్షమాపణ చెప్పాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన ఇంకా అహంకార పూరిత మాటలు కేటీఆర్ మానుకోవడం లేదని, కేటీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. గురువారం సిరిసిల్లలో కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ముందుగా కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులకు బతుకమ్మ చీరల బకాయిలు పెండింగ్‌లో పెట్టినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అవినీతి బయటపెడతామన్నారు. నేతన్నలపై అవినీతి అక్రమాలకు పాల్పడిన కేటీఆర్ సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేత కార్మికులకు అర్డర్లు ఇచ్చామని, రానున్న రోజుల్లో ప్రతీ మహిళకు నాణ్యమైన రెండు చీరలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. నేత కార్మికులకు సంబంధించిన పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గతంలో నలుగురే మాట్లాడారని, రానున్న రోజుల్లో నలుగురే మిగులుతారని అన్నారు. బతుకమ్మ చీరలను సూరత్ నుంచి తెప్పించి కోట్లు సంపాదించింది ఎవరని ప్రశ్నించారు. ఇకనైనా నేతన్నలపై రాజకీయం మానుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొగోడు కాబట్టి రాష్ట్రంలో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేసి మిమ్మల్ని గద్దె దించారన్నారు. ముఖ్యమంత్రి తొమ్మిది నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు పెట్టలేదన్నారు. అధికారులు, మేధావుల సూచనలు తీసుకుంటూ నిర్ణయాలు చేస్తున్నారని, బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించామని అన్నారు. గత ఎన్నికల్లో నేతన్నలకు బకాయిలు పెట్టి వారి జుట్టు చేతిలో పెట్టుకోవాలని చూశారన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రారంభించుకున్నామని, 60 సీట్లలో 12 మంది విద్యార్థులు సిరిసిల్ల నుంచి సీట్లు పొందారని అన్నారు. రాష్ట్రంలో నేత కార్మికులకు నేతన్న చేయూత, త్రిఫ్ట్ ఫండ్ రూ.90 కోట్లు విడుదల చేశామన్నారు. స్కూల్ యూనిఫాం, పోలీస్ యూనిఫాం బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇస్తున్నామన్నారు. సిరిసిల్లలో కాటన్ పాలిస్టర్ ఉత్పత్తుల మార్కెట్‌ను దూరం చేశారన్నారు. గతంలో రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసినా తాము ప్రజాపాలన చేస్తున్నామన్నారు. మీ ప్రభుత్వాన్ని ప్రజలు పక్కన పెట్టారని లోక్‌సభలో ఒక్క సీటు గెలవలేదని అన్నారు. మళ్లీ ఉప ఎన్నికలు అంటున్నారని, వస్తే బీఆర్‌ఎస్ నామరూపాలు లేకుండా పోతుందని అన్నారు. రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలకు 1.30 కోట్ల చీరలు ఇవ్వడానికి ఆర్డర్లు ఇస్తామన్నారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తే రికార్డు డ్యాన్స్‌లు అన్నారని గుర్తు చేశారు. అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఎందుకు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ స్కీములన్నీ స్కాములేనని, హైడ్రాతో ప్రజల సంపద కాపాడే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కక్ష సాధింపు అనుకుంటే మీ హయాం అధికారులే పనిచేస్తున్నారన్నారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ స్వరూపరెడ్డి, మాజీ కౌన్సిలర్ అడెపు చంద్రకళ, రాగుల జగన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్